క్లుప్తంగా

ఉద్యోగ విరమణ సన్మానం



నర్సంపేట : స్థానిక ఐసీడీఎస్ ఏసీడీపీఓ వల్లపు రెడ్డి హేమలతను ఉద్యోగ విరమణ సందర్భంగా పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో సీడీపీఓ మధురిమ, ఏసీడీపీఓ శ్రీదేవి ఉద్యోగులతో కలిసి శాలువాతో సన్మానించారు. అనంతరం సీడీపీఓ మధురిమ, ఏసీడీపీఓ శ్రీదేవి మాట్లాడారు. హేమలత అంగన్‌వాడీ టీచర్ నుంచి ఏసీడీపీఓ స్థాయికి ఎదిగారని చెప్పారు. కార్యక్రమంలో డీడ బ్ల్యాక్ కార్యాలయ సూపరింటెండెంట్ శ్రీదేవి, ఎంపీడీఓ శ్రీనివాస్, అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు నల్ల భారతి, యూడీసీ రెహ్మాన్, తదితరులు పాల్గొన్నారు.

రంగాపూర్ హైస్కూల్‌లో..



నల్లబెల్లి : మండలంలోని రంగాపూర్‌లోని ప్రభుత్వ హైస్కూల్ ఆవరణలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎంగా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన తూముల రఘువీర్‌ను సతీసమేతంగా ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లింగారెడ్డి అతిథిగా హాజరై మాట్లాడారు. రఘువీర్ ఉపాధ్యాయుడిగా, ఫెడరేషన్ నాయకుడిగా ఎనలేని సేవలు అందించారని తెలిపారు. తొలుత రఘువీర్ దంపతులను విద్యార్థులు, గ్రామస్తులు పూలు చల్లుతూ స్వాగతం పలికారు. కార్యక్రమంలో ప్రధాన సంపాదకుడు డాక్టర్ గంగాధర్, డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు గోవిందరాజు, నాయకులు శ్రీనివాస్, మహేందర్‌రెడ్డి, సంజీవరెడ్డి, ఉప్పలయ్య, నర్సంపేట ఎంఈఓ కొర్ర సారయ్య, తదితరులు పాల్గొన్నారు.

గీసుకొండలో..



గీసుకొండ : పంచాయతీ రాజ్ శాఖ ఏఈగా విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ పొందిన నల్ల సుధాకర్‌ను మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ కృష్ణవేణి, తహసీల్దార్ రియాజుద్దీన్ శుక్రవారం శాలువాతో సన్మానించారు. అనంతరం జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో డీఈ జ్ఞానేశ్వర్, ఏఈలు అభిరామ్, వేణు, జేటీఓ అనిల్‌కుమార్‌రెడ్డి, యాదగిరి, మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం నాయకులు రవికుమార్, ఎంపీఓ అడెపు ప్రభాకర్, సూపరింటెండెంట్ కమలాకర్, ఆర్ఐ సాంబయ్య, తదితరులు పాల్గొన్నారు.

‘సీఎంఆర్ఎఫ్’ అందజేత



చెన్నారావుపేట : మండలంలోని అమీనాబాద్ తండాకు చెందిన ధరావత్ ఈర్యకు మంజూరైన రూ.60 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును అతడి సతీమణి పద్మకు కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దన రమేశ్ శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడారు. ఈర్యకు వైద్య ఖర్చుల కోసం ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి చొరవతో చెక్కు మంజూరైందని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు బానోతు రవి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ చీర అశోక్, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు సంపత్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బండి హరీశ్, మురారి లలిత, శంకర్, దామోదర్, లలిత, తదితరులు పాల్గొన్నారు.

‘కడియం చొరవతోనే ఎయిర్‌పోర్ట్‌కు గ్రీన్‌సిగ్నల్’

పర్వతగిరి : స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వరంగల్ ఎంపీ కావ్య చొరవతోనే కేంద్ర ప్రభుత్వం మామునూరు ఎయిర్ పోర్టుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్‌రావు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలకు మేలు జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే శ్రీహరి, ఎంపీ కావ్యలకు కృతజ్ఞతలు తెలిపారు.

అభివృద్ధి పనులపై ప్రచారం చేయాలి

ఆత్మకూరు : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పనులను కాంగ్రెస్ కార్యకర్తలు ఇంటింటికీ తెలియజేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కమలాపురం రమేశ్ సూచించారు. మండలంలోని కటాక్షపూర్, హౌజ్ బుజుర్గు, నీరుకుళ్ల, పెంచికలపేట గ్రామాల్లో శుక్రవారం పార్టీ కార్యకర్తల సమావేశాలు జరిగాయి. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ, కుల గణన చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనన్నారు. కార్యక్రమాల్లో ఆత్మకూరు ఏఎంసీ చైర్ పర్సన్ బీరం సునంద సుధాకర్‌రెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పరికిరాల వాసు, సమన్వయ కమిటీ సభ్యులు రాజు, తదితరులు పాల్గొన్నారు.

నందిగామ.. ప్రగతికి చిరునామా

- అత్యున్నతంగా పల్లె ప్రకృతి వనం
- నూరు శాతం మరుగుదొడ్లు, ఇంకుడుగుంతల నిర్మాణం



గ్రామంలోని పల్లె ప్రకృతి వనం

నల్లబెల్లి : మండలంలోని నందిగామ ప్రగతికి చిరునామాగా నిలుస్తోంది. పల్లె ప్రకృతి వనం పచ్చదనంతో కళకళలాడుతూ అత్యున్నతంగా నిలుస్తోంది. స్వచ్ఛత, పరిశుభ్రతలోనూ ముందంజలో ఉంది. నూరు శాతం మరుగుదొడ్లు, ఇంకుడుగుంతలు నిర్మించిన ఘనత ఈ పల్లె సొంతం.

గ్రామంలో 721 గృహాలు ఉండగా 2856 మందిపైగా జనాభా ఉంది. గ్రామంలో నూరు శాతం మరుగు దొడ్లు నిర్మించారు. రక్షిత మంచినీటి పథకం కింద ఇంటింటికీ నల్లాలు ఏర్పాటు చేసి ఉదయం, సాయంత్రం నీరు సరఫరా చేస్తున్నారు. హరితహారంలో నాటిన మొక్కలను సంరక్షిస్తున్నారు. ట్రాక్టర్‌తో రోజూ చెత్త సేకరిస్తున్నారు. ప్రభుత్వ ప్రైమరీ, హైస్కూళ్లను కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా తీర్చిదిద్దడంతో విద్యార్థుల సంఖ్య పెరిగింది. పంచాయతీల పాలకవర్గం ఉన్న సమయంలో గ్రామస్తుల సమస్యలను పరిష్కరించేలా సర్పంచ్‌ల సహకారంతో కార్యదర్శి పూర్తి చేయించడం ఆనవాయితీగా ఉండేది. పంచాయతీ పాలకవర్గ పదవీ కాలం ముగిశాక నిధుల లేమి ఉన్నా పంచాయతీ కార్యదర్శి రాజు గ్రామస్తుల, అధికారుల తోడ్పాటుతో అనేక వసతులు కల్పిస్తున్నారు. ప్రతీ ఇంటికి సురక్షితమైన తాగునీరు అందిస్తున్నారు. కార్యదర్శి రాజు చొరవతో రెండేళ్లుగా పంచాయతీ మల్టీపర్పస్ కార్మికులకు రూ.10 లక్షల పోస్టల్ బీమా అమలవుతోంది.

నర్సరీలో ఔషధ మొక్కల పెంపకం..

వన మహోత్సవంలో భాగంగా గ్రామంలోని నర్సరీలో ఔషధ మొక్కలను పెంచుతున్నారు. మొక్కలకు జీవామృతం, వర్మీ కంపోస్టు ఎరువు తయారీ చేసి అందిస్తూ సేంద్రీయ విధానంలో మొక్కలను పెంచుతున్నారు. ఫలితంగా అన్ని మొక్కలూ ఏపుగా పెరిగి ప్రకృతి పులకరిస్తోంది. డ్రిప్‌తో నీరు అందిస్తున్నారు. సేంద్రియ ఎరువును నర్సరీలోని, పల్లె ప్రకృతి వనంలోని మొక్కలకు వేస్తున్నారు. మొక్కలను ఎండ నుంచి రక్షించేలా షేడ్ నెట్స్ ఏర్పాటు చేశారు. మిగిలిన వర్మీకంపోస్టు ఎరువును రైతులకు విక్రయిస్తూ పంచాయతీకి అదనపు ఆదాయం సమకూర్చుతున్నారు.



జీవామృతం తయారు చేస్తున్న సిబ్బంది



గ్రామంలోని అభివృద్ధిని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ సంధ్యారాణి, అధికారులు (ఫైల్)

పురస్కారాలు

పల్లె ప్రకృతి వనంలో నాటిన మొక్కలు, పచ్చదనంతో కళకళలాడుతోంది. నాటి మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, జిల్లా కలెక్టర్ ప్రావీణ్య నుంచి దీన్‌దయాల్ ఉపాధ్యాయ పంచాయతీ పురస్కారాల్లో 9 థీమ్స్‌లో భాగంగా జిల్లా స్థాయిలో ఉత్తమ పల్లె ప్రకృతి వనంగా ఎంపికైంది. అలాగే ఐదు జిల్లా స్థాయి జాతీయ పంచాయతీ పురస్కార్ అవార్డులకు ఎంపికవడంతో నాటి సర్పంచ్ నాగులగాని సలేంద్ర, కార్యదర్శి వద్ది రాజు అవార్డులు అందుకున్నారు.

గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నాం

గ్రామాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నాం. వేసవిలో పల్లె ప్రకృతి వనంలోని మొక్కలు, చెట్లు ఎండిపోకుండా డ్రిప్ పద్ధతిలో నీరు అందిస్తున్నాం. గ్రామస్తుల సహకారం, అధికారుల తోడ్పాటుతో అభివృద్ధి పనులు చేపడుతున్నాం. ఇప్పటి వరకు సుమారు రూ.2 లక్షల వరకు నా సొంత డబ్బు గ్రామాభివృద్ధి కోసం ఖర్చుపెట్టా.

- వద్ది రాజు, పంచాయతీ కార్యదర్శి, నందిగామ

టైలర్లను ప్రభుత్వాలు ఆదుకోవాలి

- మేరు సంఘం జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్

నెక్కొండ : కులవృత్తిపై ఆధారపడిన టైలర్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తోడ్పాటు అందించి ఆదుకోవాలని మేరు సంఘం జిల్లా అధ్యక్షుడు పెండ్యాల హరిప్రసాద్ కోరారు. టైలర్స్ డే సందర్భంగా కుట్టు మిషన్ రూపకర్త విలియమ్స్ హో చిత్రపటానికి పట్టణంలో కులవృత్తిదారులతో కలిసి ఆయన పూల మాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. రెడీమేడ్ దుస్తులు మార్కెట్లోకి వచ్చినప్పటి నుంచి టైలర్ వృత్తిదారులు ఆర్థికంగా, సామాజికంగా నష్టపోతున్నారని ఆందోళన వెలిబుచ్చారు. ఏ కులవృత్తిని ఆ కుల ప్రజలే చేసుకుంటుండగా మేర కులవృత్తిని మాత్రం అన్ని కులాల ప్రజలు చేసుకునేలా ప్రభుత్వాలు ఉచితంగా శిక్షణ ఇప్పించి మిషన్లు సైతం అందిస్తున్నాయని వాపోయారు. ప్రభుత్వాల తీరుతో కుల వృత్తిపై ఆధారపడిన మేర కులస్తులు ఉపాధి కోల్పోతున్నారని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మేర కుల వృత్తిదారులను ఆదుకునేలా సబ్సిడీపై రుణాలు ఇవ్వాలని, పథకాలు అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కీర్తి వెంకటేశ్వర్లు, కొత్తకొండ గణేశ్, పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పెండ్యాల శ్రీనివాస్, రామగిరి సతీశ్, జిల్లా ఉపాధ్యక్షుడు కొత్తకొండ విద్యాసాగర్, నాయకులు గట్ల వరుణ్, సంగ రాజేశ్, రామగిరి లక్ష్మయ్య, పాడిశెట్టి సత్యం, సురేశ్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న హరిప్రసాద్, తదితరులు

జాతీయ రహదారిపై గుంత.. అధికారుల నిర్లక్ష్యం



గుంతలో ఎర్ర గుడ్డతో కర్ర ఏర్పాటు చేస్తున్న సతీశ్

వర్ధన్నపేట : మండలంలోని కట్ర్యాల గ్రామ సమీపంలో వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిపై గుంత పడి ప్రమాదకరంగా ఉన్నా అధికారులు పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని బీజేపీ జిల్లా కార్యదర్శి జడ సతీశ్ అసహనం వ్యక్తం చేశారు. సతీశ్ శుక్రవారం సదరు గుంతలో ప్రమాదసూచికను తెలిపేలా ఎర్రటి వస్త్రం కట్టిన కర్రను ఏర్పాటు చేసి మాట్లాడారు. రోడ్డు కింద ఉన్న పైపులైన్ లీకేజీతో రోడ్డుపై గుంత ఏర్పడి నాలుగు రోజులుగా వాహన చోదకులకు ప్రమాదకర పరిస్థితులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. వాహనచోదకులు గుంత పక్క నుంచి వెళ్తున్నప్పటికీ ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వెలిబుచ్చారు. జాతీయ రహదారిపై నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగించే పరిస్థితిలో సంబంధిత అధికారులు ఇకనైనా వెంటనే పైపులైన్ లీకేజీని అరికట్టి గుంతను పూడ్చాలని డిమాండ్ చేశారు.

‘అంబేడ్కర్ స్ఫూర్తితో ఉద్యమించాలి’

- టీఏఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నర్సయ్య

పర్వతగిరి : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ ఆలోచనా స్ఫూర్తితో ఆత్మగౌరవ ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రజాఉద్యమాలు నిర్మించాలని తెలంగాణ అంబేడ్కర్ సంఘం (టీఏఎస్) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జన్ను నర్సయ్య పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో సంఘం జిల్లా కోకన్వీనర్ జంగిలి భాస్కర్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన విస్తృత స్థాయి సమావేశానికి నర్సయ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజలను ఆర్థికంగా, రాజకీయంగా, విద్యాపరంగా చైతన్యవంతం చేస్తూ ప్రజాసమస్యల పరిష్కారానికి పోరాటాలు నిర్మించే దిశగా సంఘం ముందుకు సాగుతోందని చెప్పారు. అంబేడ్కర్ ఆలోచనా విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నాయకులను, కార్యకర్తలను కోరారు.

కార్యవర్గం ఎన్నిక

తెలంగాణ అంబేడ్కర్ సంఘం మండల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సిరిపురం కుమారస్వామి, ప్రధాన కార్యదర్శులుగా అరిగెల రామకృష్ణ, తాళ్ల రమేశ్, చిన్నపాక శ్రీకాంత్, కార్యదర్శిగా నాగుల కుమార్, ఉపాధ్యక్షులుగా వల్లందాస్ రాజు, రాపాక ప్రభాకర్, గడ్డం ఉదయ్, కార్యవర్గ సభ్యులుగా బొక్కల ప్రభాకర్, మాసాని సునీల్, మాసాని ప్రవీణ్, జెరిపోతుల కుమారస్వామి, బాధ నర్సింగరావు, సలహాదార్లుగా కట్ల వీరభద్రయ్య, దబ్బెట నర్సయ్య, బట్టు చక్రునాయక్, దొమ్మటి వీరస్వామి, దర్గాస్వామి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కంజర్ల మహేశ్, జిల్లా కన్వీనర్ తాటికాయల వివేకానంద, ఆర్ఎస్‌పీ జిల్లా కార్యదర్శి వల్లందాస్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఎంసీపీఐ(యూ) నిరసనలు

సాక్షి నెట్‌వర్క్ : ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నిటినీ వెంటనే నెరవేర్చాలని ఎంసీపీఐ (యూ) నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆ పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లాలోని నర్సంపేట, నల్లబెల్లి, దుగ్గొండి, గీసుకొండ, సంగెం, తదితర మండలాల్లో ఆ పార్టీ మండల కమిటీల ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయాల ఎదుట శుక్రవారం ఆందోళన నిర్వహించారు. అనంతరం తహసీల్దార్లకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు కుసుంబ బాబురావు, డివిజన్ సహాయ కార్యదర్శి కొత్తకొండ రాజమౌళి, మండల కార్యదర్శులు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టారు. హామీలు అమలు చేయకుంటే పెద్ద ఎత్తున ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు.

తండ్రి మందలించాడని..

- పురుగుల మందు తాగిన కుమారుడు
- ఎంజీఎంలో చికిత్స పొందుతూ మృతి



అభిరామ్ (ఫైల్)

నల్లబెల్లి : తండ్రి మందలించాడని కుమారుడు పురుగుల మందు తాగి వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతు మృతి చెందాడు. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం.. బోల్లోనిపల్లి గ్రామానికి చెందిన బోళ్ల సర్వేశం– లత దంపతుల పెద్ద కుమారుడు అభిరామ్(17) ములుగు జిల్లా బండారుపల్లి గురుకులంలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. గత నెలలో సంక్రాంతి సెలవులకు ముందు కళాశాలలో ప్రమాదవశాత్తు అభిరామ్ చేయి విరిగింది. తల్లిదండ్రులు ఆయనను ఇంటికి తీసుకొచ్చి వైద్యం చేయించారు. కళాశాలకు వెళ్లి బుద్ధిగా చదువుకోవాలని తండ్రి మందలించాడు. ఇవేమీ పట్టించుకోని అతడు స్నేహితులతో కలిసి ఈనెల 17న నల్లబెల్లికి వెళ్లి కల్లు దావత్ చేసుకున్నాడు. సాయంత్రం తిరిగి ఇంటి వెళ్లిన అభిరామ్ తండ్రి మాటలను గుర్తు చేసుకుంటూ మనస్తాపానికి గురయ్యాడు. ఇంట్లో ఎవరూలేని సమయంలో అదేరోజు పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు ఎంజీఎంకు తరలించి చికిత్స అందించారు. ఆరోగ్య పరిస్థితి విషమించడంతో శుక్రవారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. అభిరామ్ మృతితో తల్లిదండ్రులు, కుటుంబీకులు కన్నీరు మున్నీరయ్యారు. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

దబ్బీర్‌పేటలో..

ఖానాపురం : పురుగుల మందు తాగి వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని దబ్బీర్‌పేటలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలిలా.. గ్రామానికి చెందిన ఉప్పలయ్య (70) తన వ్యవసాయ బావి వద్ద ఆయన పడిపోయి ఉండగా గమనించిన రైతులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా ఆస్పత్రికి తరలించారు. అనంతరం ఆయన ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుమారుడు స్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రఘుపతి తెలిపారు.

రేషన్‌బియ్యం పట్టివేత

ఆత్మకూరు : తక్కువ ధరకు కొనుగోలు చేసి అధిక ధరకు విక్రయించేందుకు తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. మల్కపేట గ్రామానికి చెందిన కన్నం చిరంజీవి లబ్ధిదారుల వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేసిన 5 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని అధిక ధరకు కోళ్లఫామ్‌కు విక్రయించేందుకు వెళ్తుండగా కొత్తగట్టు సమీపంలో పట్టుకున్నట్లు తెలిపారు. బియ్యం సీజ్‌చేసి ట్రాలీని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.


గుండెపోటుతో బీఆర్ఎస్ నాయకుడి మృతి

నర్సంపేట : పట్టణానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు బాణాల రాంబాబు గుండెపోటుతో శుక్రవారం మృతి చెందాడు. ఆయన మృతదేహానికి ఆ పార్టీ రాష్ట్ర నాయకురాలు, మాజీ జెడ్పీ ఫ్లోర్‌లీడర్ పెద్ది స్వప్న సుదర్శన్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రాంబాబు సతీమణి అయిన మాజీ కౌన్సిలర్ ఇందిరను స్వప్న ఓదార్చారు. రాంబాబు బీఆర్ఎస్ నాయకుడిగా ఎనలేని సేవలు అందించాడని గుర్తు చేశారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ కమిటీ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యక్షుడి, ఆర్గనైజింగ్ సెక్రటరీ నియామకం



కరుణాకర్



సంతోశ్

చెన్నారావుపేట : స్థానిక హెల్పింగ్ హాండ్స్ ఫౌండేషన్ (టు ద సొసైటీ) ఉపాధ్యక్షుడిగా పాత ముగ్దుంపురం గ్రామానికి చెందిన ననుమాస కరుణాకర్‌ను, ఆర్గనైజింగ్ సెక్రటరీగా మండల కేంద్రానికి చెందిన దొంతి రమేశ్‌ను అధ్యక్షుడు వేములపల్లి రాజు నియమించారు. ఈ మేరకు మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో రాజు మీడియాకు వివరాలు వెల్లడించారు. కరుణాకర్, సంతోశ్‌లను అభినందించారు. ఈ సమావేశంలో ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు వరంగంటి సంతోశ్‌కుమార్, కోశాధికారి నూనె సతీశ్, వర్కింగ్ ప్రెసిడెంట్ చెవ్వ రాజేంద్రప్రసాద్, ముఖ్య సలహాదార్లు ఈగ సత్యనారాయణ, కుండె మల్లయ్య, గొడిశాల మల్లయ్య, సభ్యులు బొనగాల శ్రీనివాస్, పోతు అశోక్, తాళ్లపెల్లి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



చెన్నారావుపేట : ఎగ్జిబిట్లను తిలకిస్తున్న జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్, తదితరులు



పర్వతగిరి : రోళ్లకల్ ఆర్‌డీఎఫ్ పాఠశాలలో విద్యార్థులు తయారు చేసిన ఎగ్జిబిట్స్

ఘనంగా సైన్స్ సంబురాలు

సాక్షి నెట్‌వర్క్ : జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లలో, కళాశాలల్లో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవ సంబురాలు ఘనంగా నిర్వహించారు. పలు స్కూళ్లలో విద్యార్థులు ఎగ్జిబిట్లు ప్రదర్శించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా నర్సంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లం నవీన్, జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ శ్రీనివాస్, తదితర ప్రముఖులు ప్రసంగించారు. శాస్త్రవేత్త సీవీ రామన్ సిద్ధాంతాలను, సాధించిన విజయాలను వివరించారు. సీవీ రామన్ స్ఫూర్తితో విద్యార్థులు ముందుకు సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు, హెచ్‌ఎంలు, టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.



సంగెం : కాపుల కనిపర్తి హైస్కూల్‌లో..



వర్ధన్నపేట : ఇల్లంద ప్రైమరీ స్కూల్‌లో..



నర్సంపేట : శ్రీ అభ్యాస్ స్కూల్‌లో..



నర్సంపేట : మదర్స్ ల్యాండ్ హైస్కూల్‌లో..

‘ఉపాధి’ పనులు ఉదయమే చేపట్టండి

పర్వతగిరి : మండలంలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులను ఎండాకాలం మొదలవుతున్న నేపథ్యంలో ఉదయం 7 గంటలకే మొదలు పెట్టాలని ఎంపీడీఓ మాలోతు శంకర్‌నాయక్ కోరారు. మండలంలోని గోపనపల్లిలో చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులను ఎంపీఓ పాక శ్రీనివాస్‌తో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించారు. అనంతరం గ్రామంలోని నర్సరీని సందర్శించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడారు. ఉపాధి పనులను కొలతల ప్రకారం చేపట్టాలని స్పష్టం చేశారు. నాణ్యత పాటించాలని చెప్పారు. నర్సరీలో ఖాళీగా ఉన్న బ్యాగ్‌ల్లో నారు లేదా విత్తనాలు పెట్టాలని సూచించారు. రోజు ఉదయం 7 గంటల లోపు, సాయంత్రం 5 గంటల తర్వాత మొక్కలకు నీరు పట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ సుశీల్, ఈసీ రాజు, క్లస్టర్ టెక్నికల్ అసిస్టెంట్ సురేశ్, టీఏ స్రవంతి, పంచాయతీ కార్యదర్శి పాషా, ఫీల్డ్ అసిస్టెంట్ ఐలయ్య, తదితరులు పాల్గొన్నారు.



నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న అధికారులు

క్రీడలతో యువజనుల ఉన్నతికి బాటలు



విజేతగా నిలిచిన జట్టుతో డాక్టర్ శ్రీరాంరెడ్డి, తదితరులు

- ప్రముఖ వైద్యుడు జన్నపురెడ్డి శ్రీరాంరెడ్డి

రాయపర్తి : క్రీడలతో యువజనుల ఉన్నతికి బాటలు పడతాయని ప్రముఖ వైద్యుడు జన్నపురెడ్డి శ్రీరాంరెడ్డి తెలిపారు. మండలంలోని గన్నారంలో శుక్రవారం నిర్వహించిన జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి ఆయన అతిథిగా హాజరై మాట్లాడారు. యువత క్రీడల్లో ఆసక్తి పెంచుకుని రాణించాలని ఆకాంక్షించారు. తన స్వగ్రామమైన నేపథ్యంలో గన్నారంలో యువతను ప్రోత్సహించే దిశగా జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహణకు తాను తోడ్పాటు అందించినట్లు తెలిపారు. యువత సన్మార్గంలో పయనించి సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. అనంతరం ప్రతిభ చాటిన జట్లకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నందనబోయిన ప్రవీణ్, నిర్వాహక బృందం సభ్యులు సాంబశివ, రాజు, రాజశేఖర్, రాకేశ్, శ్రీకాంత్, ప్రభుదేవా, రాజు, వికాస్, వంశీ, చింటు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

గీసుకొండ : మండల కేంద్రానికి చెందిన పసుల శశిరేఖ ఇటీవల గుండెపోటుతో మృతి చెందగా బాధిత కుటుంబానికి ఆమె కుమారులు రాజేందర్, యుగేంధర్‌ల పదో తరగతి నాటి మిత్రులు శుక్రవారం రూ.25 వేల నగదు సాయంగా అందజేశారు. తొలుత శశిరేఖ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో రామగిరి రాజేందర్, వేణు, వజ్ర రాజు, జహీర్ తదితరులు పాల్గొన్నారు.

బియ్యం ..



దుగ్గొండి : మండలంలోని స్వామిరావుపల్లికి చెందిన కూచన భాగ్యలక్ష్మి ఆమె భర్త రవి వారం, కుమారుడు 10 రోజుల క్రితం మృతి చెందగా ఒంటరి అయ్యింది. ఆమె పక్షవాతంతోనూ బాధపడుతోంది. ఈ క్రమంలో ఎల్కతుర్తి మండల ఫొటోగ్రాఫర్లు తాటూరి మధూకర్, జన్నారపు నవీన్ స్పందించారు. భాగ్యలక్ష్మికి శుక్రవారం 50 కేజీల బియ్యం సాయంగా అందించారు. భాగ్యలక్ష్మిని ప్రభుత్వం ఆదుకోవాలని వారు ఆకాంక్షించారు.

‘మహిళలు, బాలికల సంక్షేమానికి కృషి చేయాలి’

ఆత్మకూరు : మహిళలు, బాలికల సంక్షేమానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని హనుమకొండ జిల్లా సంక్షేమ శాఖ అధికారి జయంతి అన్నారు. శుక్రవారం సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో లింగాధారిత హింస నివారణ, పరిష్కారంపై అంగన్‌వాడీ టీచర్లకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నిత్యం మహిళలు కుటుంబంలోని అందరి శ్రేయస్సు కోసం ఆలోచిస్తారని, బాధ్యతలు, పనులతో కష్టపడతారని గుర్తుచేసారు. అలాంటి మహిళలు తమ నైపుణ్యాలు, విద్యపై దృష్టి పెట్టాలని సూచించారు. తప్పనిసరిగా వ్యక్తిగత, సామాజిక, ఆర్థికాభివృద్ధి సాధించాలని సూచించారు. గ్రామాల్లోని మహిళలు సమస్యలను కూడా ఎదుర్కొనే విధంగా ఉండాలని అన్నారు. చట్టాలు, ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు అండగా ఉన్నాయని అన్నారు. సర్వోదయ సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ కవిరాజ్, సీడీపీఓ స్వాతి, సమన్వయకర్త అడ్వొకేట్ సత్య, పోషణ అభియాన్ కో ఆర్డినేటర్ సుమలత, పరకాల ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఏసీడీపీఓ భాగ్యలక్ష్మి, సూపర్ వైజర్స్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వరంగల్ రూరల్ :
9951602875 9553955722
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
డి. రాజు యాదవ్ (S.R) : 9502950309 (వర్ధన్నపేట)
కె. రమేష్ (S.R) : 9441304664 (నర్సంపేట)
పి.చంద్రశేఖర్ (A.C.O) : 9963646944